క్లుప్తంగా

జూట్ మిల్లు కార్మికులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలి



కొత్తూరు జూట్ మిల్లు మేనేజర్ సురేష్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్) : ఏలూరు జూట్ మిల్లు కార్మికులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని ఇఫ్టూ ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తూరు జూట్ మిల్లు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తూరు జూట్ మిల్లు మేనేజర్ ఎస్‌ఎ సురేష్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 2022 జనవరి 27న చట్ట విరుద్ధంగా మిల్లు మూసివేసిన యాజమాన్యం ఇప్పటి వరకూ మిల్లును తెరవకపోవడమే కాకుండా కార్మికులకు చట్టప్రకారం రావాల్సిన రాయితీలు చెల్లంచకపోవడం దారుణమన్నారు. కార్మికులకు పరిహారం చెల్లించే విషయంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహారిస్తుందని ఆరోపించారు. ఈనెల 6న జెసిఎల్ వద్ద చర్చల్లో యాజమాన్యం ముందుకు వచ్చి సరైన పరిష్కారం చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ నగర అధ్యక్షుడు కాకర్ల అప్పారావు, జిల్లా ప్రధానకార్యదర్శి బద్దా వెంకట్రావు, నాయకులు కోసూరి నూకరాజు, కె.చిట్టయ్య, బగాది రమణ, బుడుమూరు శ్రీనివాస్, బుద్దా నాగేశ్వరరావు, వై.నాగేశ్వరరావు, కె.సూరి, పి.మహేష్, తదితరులు పాల్గొన్నారు.

మలేరియా వ్యాప్తికి దోమలే ప్రధానం

గణపవరం: పొడి వాతావరణంలో దోమలు వృద్ధిచెందవని, అందువల్ల ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పొడిగా ఉంచుకోవాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు పులపర్తి సంతోష్, కిరణ్మయి అన్నారు. శుక్రవారం గణపవరం -3 సచివాలయ పరిధిలో మలేరియా మాసోత్సవాల సందర్భంగా మలేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమల నిర్మూలన, పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం చేకూరుతుందని, వైరల్ జ్వరాలు దరిచేరకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది ఆయా గ్రామాలలో ప్రజలకు మలేరియా, టైఫాయిడ్, డెంగీ, అంటు వ్యాధులపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. సీహెచ్‌వో జాలాది విల్సన్, ఆరోగ్య సహాయకులు యోహాన్, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

యంత్రాలతో సాగుకు సిద్ధం



చొదిమెళ్ల రైతులకు ట్రాక్టర్ అందించిన అధికారులు



వెంకటాపురంలో రైతులకు యంత్రాలు అందిస్తున్న వ్యవసాయ అధికారులు

- రైతులకు రూ.35 లక్షల రాయితీతో యంత్రాలు
- ఆర్బీకే ద్వారా అర్హులు గుర్తింపు

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో వ్యవసాయం పండుగలా మారింది. రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా వ్యవసాయం రంగాన్ని వేగవంతం చేస్తోంది. ఇందుకోసం గ్రామాల్లో రైతులను జెఎల్‌వీ గ్రూపులుగా ఏర్పాటు చేసి ఆర్థిక సాయం చేస్తోంది. గ్రూపుల్లో సభ్యులైన రైతులు కేవలం 10 శాతం నగదు చెల్లించి ట్రాక్టర్లు, రోటోవేటర్లు, పరద టిల్లర్లు, డిస్కలు, పిచ్‌కారీ యంత్రాలు కొనుగోలు చేసేందుకు సహకరిస్తోంది. మరో 40 శాతం ప్రభుత్వం చెల్లించగా, మిగిలిన 50 శాతం బ్యాంకులు రుణ సాయం చేస్తున్నాయి. ప్రభుత్వం కృషి ఫలితంగా నేడు వరి, మొక్కజొన్న, అరుతడి పంటలు సాగు చేసే రైతుల చేతులకు యంత్రాలు తోడయ్యాయి. రూ. 35 లక్షలు సబ్సిడీ : ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ అధికారులు ఏలూరు మండల గ్రామాల్లో రైతులు యంత్రాలు కొనుగోలు చేసేందుకు రూ.35 లక్షల సబ్సిడీ అందించింది. 2021-2022 సంవత్సర కాలంలో 8 ఆర్బీకే కేంద్రాల ద్వారా రూ 25. 67 లక్షల సబ్సిడీతో యంత్రాలు, ట్రాక్టర్లు అందించింది. ఇదే క్రమంలో 2022-2023లో 4 ఆర్బీకే కేంద్రాల ద్వారా రూ 9.25 లక్షల సబ్సిడీ కల్గిన రెండు ట్రాక్టర్లు అందించారు. మొత్తంగా సుమారు 60 మంది రైతులతో కూడిన 12 గ్రూపులకు ప్రభుత్వం 35 లక్షలు రూపాయలు సబ్సిడీ ఇచ్చింది.

ప్రభుత్వం కృషి బాగుంది



వ్యవసాయాన్ని అభివృద్ధి బాట పట్టించేందుకు ప్రభుత్వం జెఎల్‌వీ గ్రూపులు ఏర్పాడు చేయడం మంచి పరిణామం. ఎందుకంటే ఖరీదైన యంత్రాలు కొనుగోలు చేయాలంటే సన్న, చిన్నకారు రైతు ఆర్థిక స్థోమత ఉండదు. అందుకే ఐదుగురు కలిసి గ్రూప్‌గా ఏర్పడి ట్రాక్టర్ కొనుగోలు చేసుకోవచ్చు. రైతులు అందరూ గ్రూపులుగా ఏర్పడితే ప్రభుత్వం నుంచి మరిన్ని సదుపాయాలు పొందవచ్చు. ఇది వ్యవసాయానికి మేలు చేస్తుంది.

– బెజవాడ వెంకన్న, చొదిమెళ్ళ.

యంత్రాలతో మరింత మేలు



ప్రభుత్వం అందించే యంత్రాలతో వ్యవసాయ రంగానికి మరింత మేలు జరుగుతుంది. గతంలో ఎకరం పొలం దుక్కి దున్నాలంటే రైతులు ఎంతో శ్రమించే వారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ప్రభుత్వం ట్రాక్టర్లు ఇవ్వడం వల్ల రైతు కేవలం 6 గంటల్లో ఎకరం పొలం దున్నేయవచ్చు. ఇది రైతులకు ఎంతో మేలు చేస్తుంది.

– రావూరి రామకృష్ణ, చొదిమెళ్ల

50 శాతం సబ్సిడీ బాగుంది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయాన్ని పండుగ చేసి చూపిస్తున్నాడు. రైతులు యంత్రాలు కొనుగోలు చేసేందుకు 40 శాతం సబ్సిడీ అందించడం బాగుంది. ఒక్కో ట్రాక్టర్ కొనేందుకు సుమారు రూ 3.50 లక్షలు సబ్సిడీ వస్తోంది. దీనివల్ల మరింత మంది రైతులు యంత్రాలు పొందేందుకు ముందుకు వస్తారు. యంత్రాలు ఉపయోగించడం వల్ల రైతుతో పాటు వ్యవసాయానికి ఎంతో మేలు చేస్తుంది.

– బండి రాంబాబు. చొదిమెళ్ల.

తక్కువ అద్దెతో యంత్రాలు తీసుకోవచ్చు



జెఎల్‌వీ గ్రూపులకు ప్రభుత్వం ట్రాక్టర్ అందించడం వల్ల ఇతర రైతులకు కూడా మేలు జరుగుతుంది. ట్రాక్టర్ లేని రైతు జెఎల్‌వీ గ్రూపు నుంచి తక్కువ అద్దెకు ట్రాక్టర్ తీసుకోవచ్చు. దీనివల్ల రైతుకు తక్కువ రెంట్‌కు ట్రాక్టర్ వస్తుంది. ఇదే సమయంలో జెఎల్‌వీ గ్రూపులకు సైతం ఆధాయం సమకూరుతుంది. ఈ ఆదాయంతో బ్యాంక్‌కు నెలవారీ ఇన్‌స్టాల్‌మెంట్ తేలికగా చెల్లించవచ్చు.

– యక్కల త్రిమూర్తులు, చొదిమెళ్ల

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



మేం జెఎల్‌వి గ్రూప్‌లో మేము పది మంది సభ్యులం. రూ.74 వేల 392 లతో మహేంద్ర టెక్ ట్రాక్టర్ కొన్నాం. దీని విలువ రూ. 7 లక్షల 43 వేల 915లు. ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ అందించడం వల్ల మాకు రూ 2.97లక్షల 506లు లాభం వచ్చింది. మిగిలిన రూ.3 లక్షల 71వేల957లు బ్యాంక్ లోన్ ఇచ్చింది. సీఎం జగన్ కు కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

– రావూరి వెంకటేశ్వరరావు,చొదిమెళ్ల

ధాన్యం బకాయి సొమ్ములు వెంటనే చెల్లించాలి



రైతుల సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ఏలూరు (టూటౌన్): రైతులకు, కౌలు రైతులకు ధాన్యం బకాయి సొమ్ములు వెంటనే చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక సుంకర వారి తోటలో శుక్రవారం నిర్వహించిన రైతుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.రైతులు ధాన్యం అమ్మిన 21 రోజుల్లో సొమ్ములు చెల్లిస్తామన్న ప్రభుత్వ నిబంధనను సవరించాలని కోరారు. ధాన్యం సొమ్ములు పంట అమ్మిన వెంటనే చెల్లించే విధానం తీసుకురావాలన్నారు. ధాన్యం బకాయి సొమ్ములు సకాలంలో చెల్లించకపోవడం వలన రైతులు పెట్టుబడికి తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోయి నష్టపోతున్నారన్నారు. భూయజమానులతో ఒప్పంద పత్రాలు, సంతకాలతో నిమిత్తం లేకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలని కోరారు. ఖరీఫ్ సాగుకు కౌలు రైతులందరికీ వడ్డీ లేని పంట రుణాలు అందించే విధంగా ప్రభుత్వం తగు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బైరెడ్డి లక్ష్మణరావు, తలారి జయరాజు, అన్నంరెడ్డి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ డీఈఈపై చర్యలు తీసుకోవాలంటూ వినతి



డిఈఈపై ఉన్న ఆరోపణలకు సంబంధించిన వివరాలను పబ్లిక్ హెల్త్ డిఈఈకి అందిస్తున్న మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

ఏలూరు (టూటౌన్) : ఏలూరు కార్పొరేషన్‌లో డీప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా పనిచేస్తున్న వంగపండు వెంకట సత్యనారాయణపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం కార్పొరేషన్ పబ్లిక్ హెల్త్ డీప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు ఆరోపణలకు సంబంధించిన వివరాలను అందజేసారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి ఎ.అప్పలరాజు మాట్లాడుతూ డీప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న వంగపండు సత్యనారాయణపై చర్యలు తీసకోవాలని కోరుతూ ఈఎన్సీ(పిహెచ్) వారికి యూనియన్ ఆధ్వర్యంలో 2022,నవంబరు 9న ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. దీనిపై 2022,నవంబరు 29న రాజమండ్రి పబ్లిక్ హెల్త్ సూపరింటెండెంట్‌ను విచారణ చేయమని ఆదేశాలు ఇచ్చినా ఇప్పటి వరకూ విచారణ రిపోర్టు, యూనియన్‌కు పంపలేదన్నారు. దీనిపై శుక్రవారం ఏలూరు కార్పొరేషన్ పబ్లిక్ హెల్త్ డీప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యూనియన్ నాయకులును పిలిచి అభియోగాలపై వారి వద్ద ఉన్న ఆధారాలను తీసుకోవడం జరిగిందన్నారు. అధికాదాయం కలిగి ఉన్నారనే కేసులో ఏసీబీ గతంలో ఆయనపై కేసు నమోదు చేసిందని, ఏసీబీ కేసులో ఇరుక్కున్న సత్యనారాయణ తిరిగి ఏలూరు కార్పొరేషన్‌లో ఏ విధంగా పనిచేస్తున్నారని యూనియన్ నాయకులు ప్రశ్నించారు. ఇప్పటికైనా ఏసీబీ కేసులో ఇరుక్కున్న క్రింది స్థాయి ఉద్యోగులపై దురుసుగా ప్రవర్తిస్తున్న వంగపండు సత్యనారాయణను వేరే ప్రాంతానికి బదిలీ చేయాలని, అతనిపై చర్యలు తీసుకోవాలని యూనియన్ కార్యదర్శి అప్పలరాజు డిమాండ్ చేశారు.

తారెత్తిస్తున్న ఎండలు

జనం ఉక్కిరిబిక్కిరి

- వడగాల్పులతో జనం హడల్
- సరిగా పనిచేయని ఏసీలు, కూలర్స్
- వేడిగాలి వీస్తోన్న ఇంట్లో ఫ్యాన్‌లు



జనసంచారం లేక వెలవెలబోయిన ఏలూరు అశోక్‌నగర్ మెయిన్ రోడ్డు

ఏలూరు టౌన్: భానుడు భగభగలకు జనం అల్లాడిపోయారు... గత మూడు రోజులుగా భానుడి మండిపడుతున్నాడు... రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెంచుకుంటూ ఉగ్రరూపం దాల్చుతున్నాడు... వేడి గాలులు వీస్తూ ఊపిరి పీల్చుకునేందుకు సైతం ఇబ్బందిపడేలా వేడిమి వస్తోంది. రోహిణి కార్తికి రోళ్లు బద్దలయ్యేలా ఉష్ణోగ్రతలు నమోదు కావటంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. శుక్రవారం విపరీతమైన వడగాల్పులతో ఉదయం నుంచే జనం బయటకు రావటానికి భయపడిపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎండలు మండిపోగా... ఏలూరు నగరంలో 43.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైంది. వాతావరణ శాఖ ముందుగానే హెచ్చరించింది. తీవ్రమైన వడగాడ్పులు వీస్తాయనీ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

బెంబేలెత్తిస్తోన్న భానుడు :
ఏలూరు నగరంలో జనం తీవ్రమైన ఎండ వేడిమితో అవస్థలు పడ్డారు. ఉదయం నుంచే ఉక్కబోత ప్రారంభం కాగా మధ్యాహ్నం సమయానికి అగ్ని కురిసిందా అన్నట్టు .. వేడి గాలులు వీస్తూ భయపెట్టాయి. బయట ప్రాంతాల్లో పనులు చేసే కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇక ఇళ్లలో ఉండేవారు ఏసీలకే పరిమితమయ్యారు. ఏసీలు సైతం సరిగ్గా పనిచేయని పరిస్థితి కనిపించింది. కూలర్లు పెట్టుకున్న వేడిగాలులు వచ్చాయని పలువురు అంటున్నారు. ఇక ఫ్యాన్‌లు వేసుకుంటే వేడి గాలులు రావటంతో జనం ఉక్కబోతతో అల్లాడిపోయారనే చెప్పాలి. రోహిణి కార్తి ప్రారంభం అయ్యాక శుక్రవారం తీవ్ర వేడిమి, వడగాడ్పులు జనాన్ని బెంబేలెత్తించాయి. భానుడి ప్రతాపంతో నగరంలో రహదారులన్నీ జనం లేకవెలవెలబోయాయి. వ్యాపార, వాణిజ్య వర్గాలు సైతం ఇబ్బందులు పడ్డారు. కొందరు దుకాణాలను మధ్యాహ్నం వేళల్లో మూసివేస్తూ మళ్లీ సాయంత్రానికి గానీ తీసే పరిస్థితి లేదు. రాష్ట్ర విపత్తుల సంస్థ సైతం ప్రజలకు ఫోన్లలో మెస్సేజ్‌లు వేస్తూ హెచ్చరిస్తోంది.



ఖాళీగా దర్శనమిస్తున్న ఏలూరు అమీనాపేట మెయిన్ రోడ్డు

ప్రజలు జాగ్రత్తలు పాటించాలి



ప్రజలు వేసవిలో జాగ్రత్తలు పాటించాలి. అవసరం లేకుండా బయటకు వెళ్లకుండా ఇంట్లోనే ఉండాలి. బయటకు వెళ్లేప్పుడు టోపీ, ముఖానికి మాస్క్, కళ్లకు సన్‌గ్లాస్, కాటన్ వస్త్రాలు ధరించటం మంచిది. వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, దీర్ఘకాలిక రోగులు విషయంలో మరింత జాగ్రత్త అవసరం. నీరు తాగుతూ ఉండాలి, జ్యూస్‌లు, ద్రవాహారం తీసుకోవాలి. చెరకు రసం, చల్లటి మజ్జిగ, నిమ్మరసం నీళ్లు, ఓఆర్‌ఎస్ వంటివి తాగాలి. శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలి. ఏదైనా అసౌకర్యంగా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ ఏ.హరికృష్ణ, నరాలు, మానసిక వైద్యనిపుణులు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	30	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	40	దిక్కుడు కాయలు	76
వంకాయలు (కాంతులు)	44	చామదుంపలు	50
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	05-08
బెండకాయలు	36	కంద	56
పచ్చిమిర్చి	36-40	బీట్‌రూట్	36
కాకర కాయలు	44	కీరా దోస	40
బీరకాయలు	32	ఫ్రెంచ్‌బీన్స్	96
బీరకాయలు (పందిరి)	--	అల్లం	220
క్యాబేజీ	20	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	34	పాలకూర	10
దొండకాయలు	24	చుక్కకూర	10
బంగాళదుంపలు	22	తోటకూర	10
ఉల్లిపాయలు	18	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	12	బఠాణీ	--
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	96
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	36

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	01
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	00
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	02
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	23

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	01
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	01
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	02
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	00
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	01
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	22.15	34820	03
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	28
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	36
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	31

7న ప్రత్యేక హోదా, విభజన చట్టంపై దీక్ష

ఏలూరు (టూటౌన్): ఈనెల 7న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టం అమలు కోసం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో దీక్ష నిర్వహిస్తున్నట్లు జాయింట్ యాక్షన్ కమిటీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కన్వీనర్ మత్రి రాజా శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఏలూరు వసంత మహల్ సెంటర్ శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఈ దీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ దీక్షలో అఖిల పక్షం, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, రైతు సంఘాలు, చేనేత కార్మికులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, పోరాట సంఘాలు పెద్ద సంఖ్యలో పాల్గొనాల్సిందిగా కోరారు.

క్షయ రహిత సమాజ స్థాపనకు సమష్టి కృషి

భీమడోలు: క్షయ రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరిండెంటెంట్ సునీత అన్నారు. టీబీ ముక్తి భారత్ అభియాన్‌లో భాగంగా శుక్రవారం దత్తత తీసుకున్న టీబీ రోగులకు దాత ఉన్నమట్ల సత్యనారాయణ ఆర్థిక సాయంతో వారికి ఫుడ్ బాస్కెట్లు అందించారు. ఒకొక్కరికి బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను ఉచితంగా అందించారు. దాత ఉన్నమట్ల సత్యనారాయణ సేవా దృక్పథాన్ని వైద్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వి.ర విపాల్, ఆల్బర్ట్, రష్మీ, టీబీ సూపర్ వైజర్ తోట మనోజ్‌కుమార్, సిబ్బంది పరమేశ్వరరావు, సింహాద్రి పాల్గొన్నారు.

ఉపాధి కూలీల మస్తరు తనిఖీ

ఉంగుటూరు: ఉపాధికూలీలు మస్తరునను ఎ.గోకవరం సర్పంచి మిద్దే సత్యవతి శుక్రవారం పరిశీలించారు. ఎ.గోకవరంలో నిర్వహిస్తున్న ఉపాధి కూలీల పనులను, మస్తరు నమోదును ఆకస్మికంగా పరిశీలించారు. ఉపాధి మేట్లకు, కూలీలతో సర్పంచి మాట్లాడారు. కాసేపు వారితో కలిసి ఆమె పనిచేసి ఉత్సాహ పరిచారు.

రావులపర్రులో విగ్రహాల ఊరేగింపు

ఉంగుటూరు: రావులపర్రులో మహాలక్ష్మి, కట్లమ్మ అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా రెండోరోజు శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవార్ల విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పూజలు చేశారు. శనివారం ఉదయం 8గంటలకు విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు చేశారు.

విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న చీర్ల పద్మశ్రీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థులు చిన్ననాటి నుంచే గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ చీర్ల పద్మశ్రీ పిలుపునిచ్చారు. శుక్రవారం ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశం పద్మశ్రీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగడానికి, గ్రంథాలయాలను అభివృద్ధి పథంలో ఉంచడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో 2023-24 సంవత్సర బడ్జెట్ రూ. 3,34,54,000 మంజూరు కాగా దీనిలో ఇప్పటివరకు రూ. 22,86,800 ఖర్చు చేసినట్లు తెలిపారు. వీటిలో ప్రయాణ భత్యం, టెలిఫోన్, ప్రింటింగ్ అండ్ స్టేషనరీ, అద్దెలు, విద్యుత్, వాటర్ ఛార్జీలు, బీడీసీ వర్కర్స్ రెమ్యూనరేషన్, పార్ట్ టైం వర్కర్స్ రెమ్యూనరేషన్, న్యూస్ పేపర్ల పత్రికలు కొనుగోళ్ల తదితర ఖర్చులు, అలాగే వివిధ పద్దుల కింద ఖర్చు చేసుకోవడానికి పరిపాలన ఆమోదం కోసం సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ సభ్యులైన జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌వీ రవిసాగర్, జిల్లా పంచాయతీ అధికారి ఏవీ విజయలక్ష్మి , జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎస్. భవాని, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి యం. శేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

దోసపాడు దళితులకు న్యాయం చేయాలంటూ ధర్నా



వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న దోసపాడు దళితులు

ఏలూరు (టూటౌన్) : దెందులూరు మండలం దోసపాడు దళితులకు న్యాయం చేయాలంటూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. దోసపాడులో 1965,1974 మధ్య కాలంలో ఇచ్చిన పట్టాలు, పాస్ బుక్కులు, రెవెన్యూ రికార్డులను పరిశీలించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోసపాడు దళితులు,పేదలు గత సంవత్సర కాలం నుంచి వారి భూముల కోసం పోరాటం చేస్తున్నా జిల్లా యంత్రాంగం పట్టించుకోకపోవడం దారుణమన్నారు.పేదల హక్కులను కాలరాస్తూ దళితుల చట్టాలను నీరుగారుస్తూ తీవ్రమైన అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్,జాయింట్ కలెక్టర్ ఈ సమస్యను అనేక పర్యాయాలు వారి దృష్టికి తీసుకెళ్లినా రెవెన్యూ యంత్రాంగం దీని పరిష్కారం చేయకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సిహెచ్ జాన్ రాజు, నాగేంద్ర, పవన్,మణి, బేబీ, మాణిక్యం, ఏసుమణి తదితరులు పాల్గొన్నారు.